అంతర పంటగా అవిశ



అమరాపురం మండలంలో సాగులో ఉన్న అవిశ పంట

- వక్క మొక్కలకు నీడ కోసం సాగు
- మడకశిర నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో పంట
- పశువుల మేతకు ఉపయోగిస్తున్న రైతులు

నియోజకవర్గంలో అవిశ సాగు ఇలా..

మండలం	ఎకరాలు
అమరాపురం	500
రొళ్ల	200
అగళి	150
గుడిబండ	100
మడకశిర	50

అమరాపురం: జిల్లాలోనే మడకశిర నియోజకవర్గం వక్క తోటలకు ఎంతో ప్రసిద్ధి. 5 వేల ఎకరాలకు పైగా వక్క సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వక్క మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు అంతర పంటగా 'అవిశ'ను సాగు చేస్తున్నారు. ఈ మొక్కలు నాలుగు నెలల్లోనే పెద్దగా మారుతుండటం రైతులకు కలిసివస్తోంది. వక్క మొక్కలకు రక్షణ ఇవ్వడంతో పాటు కొద్దిపాటి ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి కూడా తక్కువ..

నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో అవిశ పంట సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులందరూ వక్క సాగులో అంతర పంటగానే అవిశను ఎక్కువగా వేస్తుంటారు. ఎకరాలో అవిశను పెట్టాలంటే రూ.350 నుంచి రూ.400 మధ్య దొరికే విత్తనాల ప్యాకెట్ సరిపోతుందని రైతులు చెబుతున్నారు. ఆ తర్వాత వాటికి పెద్ద మందుల అవసరం కూడా ఉండదంటున్నారు. కేవలం నాలుగు నెలల్లోనే పెద్దగా మారుతుండటంతో వక్క మొక్కల రక్షణకు ఉపయోగపడుతున్నాయని అంటున్నారు.

ఎకరాకు రూ.50 వేల దాకా..

అవిశ చెట్ల ఆకులను కోత కోసి గొర్రెల కాపర్లకు అమ్మకం చేస్తారు. ఎకరాకు రూ.50 వేల దాకా లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండకాలం కావడంతో గొర్రెలు, మేకలకు మేత దొరకని సమయంలో ఈ అవిశ ఆకు చాల ఉపయోగపడుతోంది. ఈ ఆకును గొర్రెల కాపరులు ఒక సాలుకు లెక్క కట్టి కోత కోసుకుని తీసుకెళ్తారు. వాటిని గొర్రె పిల్లలు, మేక పిల్లలకు, చిన్న చిన్న ఆవు దూడలకు మేతకు వేస్తారు. కేవలం స్థానికులే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంత వాసులు కూడా వచ్చి అవిశ ఆకును కొనుగోలు చేస్తుంటారు. దీని వల్ల ఇటు రైతులు ఇటు గొర్రెల కాపరులకు ఎంతో మేలు జరుగుతోంది. నియోజకవర్గంలోనే అమరాపురం మండలంలోని దేవగానపల్లి, నగోనపల్లి, తమ్మడేపల్లి, గొడనకుంట, మద్దనకుంట, హాలుకూరు, చిట్నడకు, ఉదుగూరు గ్రామాల్లో 500 ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారు.

గొర్రెలకు ఎంతో మేలు



అవిశ ఆకుతో గొర్రెలకు ఎంతో మేలు చేకూరుతోంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట లేక పోవడంతో గడ్డి దొరకడం కష్టంగా మారింది. అంతే కాకుండా మేతకు ప్రస్తుతం ఇబ్బందిగా ఉంది. దీంతో అవిశ ఆకు దొరకడం వలన మేతకు ఉపయోగ పడుతోంది.

– చంద్రప్ప, గొర్రెల కాపరి, అమరాపురం

అవిశ ఆకు కొంటున్నాం



గొర్రె పిల్లలను బయటికి తోలుకొని పోలేము. దీంతో వాటి మేత కోసం అవిశ ఆకును అమరాపురం మండలంలోని రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నా. ప్రతి యేటా రూ.30 వేల వరకూ అగిశ ఆకుకు ఖర్చు చేస్తున్నా. ముఖ్యంగా ఈ ఆకు తింటే గొర్రెల మాంసం రుచిగా ఉంటుంది.

– చిత్తప్ప, క్యాదిగుంట, కర్ణాటక రాష్ట్రం

ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి



ప్రభుత్వం గొర్రెల కాపరులకు ఉచితంగా అవిశ దాణా ఇస్తే బాగుంటుంది. అవిశ ఆకును డబ్బులు పెట్టి రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నాము. అయితే తక్కువ గొర్రెలు, మేకలు ఉన్నవారు డబ్బు వెచ్చించి కొనుగోలు చేయలేము. దీంతో మాలాంటి వారికి ప్రభుత్వం ఉచితంగా గొర్రె పిల్లలకు ఫీడింగ్ ఇస్తే బాగుంటుంది.

– నగేష్, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

క్లుప్తంగా

ఇంటి పట్టాలివ్వాలని ధర్నా



డీటీ మైనుద్దీన్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

హిందూపురం: పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ శుక్రవారం సీఐటీయూ ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీసు వద్ద ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కొట్నూరు వద్ద ఇంటి స్థలాల కోసం గుడిసెలు వేశామని, గతంలో పోలీసులు గుడిసెలను తొలగించారని ప్రస్తుతం పేదలకు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. న్యాయం చేయాలని హైకోర్టును కూడా ఆశ్రయించామన్నారు. ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, రాజప్ప, సరస్వతి, జ్యోతి, నాజియా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా గురుమూర్తి



మడకశిర: మడకశిర వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా బీఎస్ గురుమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రొళ్ల మండలం హెచ్‌టీ హళ్లి గ్రామానికి చెందిన గురుమూర్తి రొళ్ల పీఏసీఎస్ చైర్మన్‌గా కూడా పని చేశారు.

బాబయ్య దర్గాలో భక్తుల సందడి



భోజనం చేస్తున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య స్వామి దర్గా వద్ద భక్తుల సందడి నెలకొంది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన సతామి సెహరీకి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా బాబయ్య దర్గా పూర్వ పీఠాధిపతి తాజ్‌బాబా ఆయన కుమారుడు, పీఠాధిపతి సలావుద్దీన్ బాబా నేతృత్వంలో వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులతో దర్గా ప్రాంతం కిటకిటలాడింది.

కార్యదర్శిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



అధికారులకు సమస్యను వివరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

సోమందేపల్లి: మురుగు కాలువ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేసిన మాల ప్రకాష్ తో పాటు ఓ పత్రికలో వార్త రాసిన విలేకరిని బెదిరించిన పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే శుక్రవారం పంచాయతీ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని డీపీఓ సమతతో మాట్లాడించారు. షోకాజ్ నోటీస్ జారీ చేసి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డీపీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సీపీఎం నాయకులు మాబూ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం పాట

అమరాపురం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు వారపు సంత, దినసరి సంత, జంతు వధ శాల, బస్టాండు తదితర వాటికి వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.పది వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు.

సామూహిక వివాహాలను విజయవంతం చేయండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 7న నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి తెలిపారు. శుక్రవారం సామూహిక వివాహాల నిర్వహణపై ఆలయంలో గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. అనంతరం ఉచిత సామూహిక వివాహాల కరపత్రాలను విడుదల చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్



మాట్లాడుతున్న మానిపాటి శ్రీధర్

చిలమత్తూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్డి చెన్నంపల్లిలో బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు అనే అంశాలపై న్యాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ చట్టాలపై పట్టు సాధించడం ద్వారా సమాజం న్యాయం దిశగా అడుగులు వేస్తుందన్నారు. దేశంలో అక్షరాస్యత బాగా వృద్ధి చెందిందని, అయినా సమాజంలో చెడు ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. వాటిని రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. మహిళలను గౌరవించాలని, లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం, ఎంపీడీఓ రమణమూర్తి, ఏపీపీ ఇందాద్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, ఏపీఎం సువర్ణ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై పక్కాగా విచారణ చేయాలి



మాట్లాడుతున్న పాస్టర్స్, లీడర్స్ అసోసియేషన్ నాయకులు

హిందూపురం టౌన్: పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై అనుమానాలున్నాయని, రోడ్డు ప్రమాదామా? హత్య? అని పక్కాగా విచారణ చేపట్టి అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ది యూనైటెడ్ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ రాజమండ్రి ప్రాంతం హైవే రోడ్డు ప్రమాదంలో చనిపోయారని ఆ ప్రాంత పోలీసులు పేర్కొంటున్నారన్నారు. అయితే అది రోడ్డు ప్రమాదం కాదు, హత్య అని అక్కడికి వెళ్లి ప్రత్యక్షంగా చూసినవారు చెబుతున్నారన్నారు. ఈ కేసులో పోలీసులు అన్ని కోణాల నుంచి పూర్తిస్థాయిలో న్యాయ విచారణ చేసి, అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సోషల్ మీడియా వేదికగా ప్రవీణ్‌ను చంపుతామని బెదిరిస్తూ ఎన్నో మెసేజీలు రావడం అందరికీ తెలిసిందేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుగజేసుకొని ఈ కేసును సంబంధిత అధికారులకు అప్పగించి నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో నాయకులు సూర్య ప్రకాష్, పాల్ తిమోతీ, దేవరాజు, జాన్సన్ ప్రకాష్, జగదీష్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఇజ్రాయిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించండి



అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

హిందూపురం టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేస్తూ విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి పెంచిన ధరలు తగ్గించి, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

చిలమత్తూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌కు శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు , ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, నరసింహ పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పెంచిన ట్రూప్ చార్జీలను తగ్గించాలంటూ సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యలయంలో శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికల వేల విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూప్ చార్జీల పేరుతో యూనిట్‌పై 65 పైసలు అదనంగా భారం మోపడం దారుణమన్నారు. నాయకులు హరి, బాబావలి, తిప్పన్న, మహబూబ్ బాషా, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఊరేగింపు



ముత్యాలమ్మను ఊరేగిస్తున్న భక్తులు

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లి ముత్యాలమ్మను గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వేట నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.



పార్వేట ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

- సమన్వయకర్త ఈరలక్కప్ప



పార్టీ నాయకులతో సమావేశమైన ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. శుక్రవారం ఆయన మడకశిరలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమికి ప్రజలు కూటమి బుద్ధి చెప్పారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎదురు తిరిగే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. కూటమి నాయకుల దౌర్జన్యాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడు, కౌన్సిలర్ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ నారాయణప్ప, స్థానిక నాయకులు శేషు, అశ్వత్థ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



హిందూపురం: మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

హిందూపురం టౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా హిందూపురం ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని దాదాపు 20 మసీదుల వద్ద నల్ల రిబ్బన్లు చేతికి కట్టుకని శుక్రవారం ముస్లింలు నిరసన తెలిపారు. అఖిల భారత టిప్పు సుల్తాన్ యూనైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం సమాజ అభివృద్ధిని జీర్ణించుకోలేని కేంద్రం ప్రభుత్వం దుర్మార్గమైన వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయటానికి ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, అలాగే సీఎంలు నితీష్ కుమార్, చిరాగ్ పాశ్వాన్ ఈ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం అధ్యక్షుడు షేక్ షబ్బీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, బిలాల్, అమీన్, అబ్దుల్ సలాం, చిటిక్, ముజీబ్ పాల్గొన్నారు.

గోరంట్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం జమియత్ ఉలమా ఏహింద్ ఆధ్వర్యంలో పట్టంలోని అన్ని మసీదుల్లో ముస్లింలు పార్థనల అనంతరం కుడి చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు జమియత్ ఉలమా ఏహింద్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రోన్లతో నిఘా

పెనుకొండ: అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టిసారించారు. ముఖ్యంగా పెనుకొండ, రొద్దం మండలాల్లో జూదాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం రొద్దం, పెనుకొండ పోలీసులు డ్రోన్ కెమెరాలతో వ్యవసాయ పొలాలు, కొండ గుట్టలు, గ్రామాల్లో సైతం జల్లెడ పట్టారు.

గురుకుల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

హిందూపురం: హిందూపురంలోని ఏపీ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష తేదీని మార్చినట్లు ప్రిన్సిపాల్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ జరగాల్సిన పరీక్షను ఏప్రిల్ 13న నిర్వహిస్తామన్నారు.

వేలంపాట వాయిదా

గోరంట్ల: మండల కేంద్రంలో ప్రతి సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగే కురగాయల మార్కెట్‌తో పాటు పంచాయతీకి చెందిన జేఆర్‌వై రూములు, స్టాండ్ ఫీజు వేలం పాట శనివారం జరగాల్సి ఉంది. అయితే అనివార్య కారాణాల వల్ల వచ్చే నెల 3వ తేదీకి వేలంపాటను వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం పేర్కొన్నారు.

పరికరాల అందజేత

అమరాపురం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఈఓఆర్డీ నాగముని అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్త డివైస్‌లను అందజేశారు. గతంలో ఉన్న పరికరాలు పాతవి కావడంతో పాటు సక్రమంగా పని చేయకపోవడంతో వాటిని తీసుకుని కొత్తవి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాల పై చర్చించారు. మున్సిపాలిటీలోని సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు చైర్ పర్సన్ సూచించారు. మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగస్వామి తెలిపారు. సమావేశంలో వైఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, అధికారులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

దుకాణదారుడికి రూ.20 వేల ఫైన్ !

మడకశిర: పట్టణంలో కొందరు వ్యాపారులు దుకాణాల్లో కాలం చెల్లిన బిస్కెట్లను అమ్ముతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలనే ఓ ప్రభుత్వ కార్యాలయంలో అధికారులకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించారు. అధికారులకు టీతో పాటు బిస్కెట్లు ఇచ్చారు. ఈ బిస్కెట్లు నాసిరకంగా ఉండటంతో పాటు కాలం చెల్లినవిగా గుర్తించారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న ఓ దుకాణంలో బిస్కెట్లను కొనుగోలు చేశారు. అధికారులు వెంటనే దుకాణాన్ని గుట్టుచప్పుడు కాకుండా తనిఖీ చేశారు. కాలం చెల్లిన బిస్కెట్లను గుర్తించి వ్యాపారికి రూ.20 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిసింది.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి: మండలంలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. మధుడి గ్రామానికి చెందిన గోవిందప్ప మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 18 రాజా విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పురం మున్సిపాలిటీ ఆదాయానికి గండి

- బకాయిలు చెల్లించకనే మరొకరి పేరుతో టెండర్ దక్కించుకున్న వైనం
- నేడు జరగనున్న కౌన్సిల్ మీట్‌లో ఆమోదానికి సిద్ధం



హిందూపురం మున్సిపల్ కార్యాలయం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వేలం దక్కించుకున్న వారితో కుమ్మక్కై రూ.లక్షలు దోచేస్తున్నారు. బహిరంగ వేలాల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. అయితే వేలం పాట దక్కించుకున్న వాళ్లు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన నగదును చెల్లించడం లేదు. బకాయిని ఎగ్గొట్టడంతో పాటు మరోసారి వేలం పాటలో పాల్గొంటున్నారు. బినామీల పేర్లతో టెండర్‌ను దక్కించుకొని మళ్లీ బకాయిని ఎగ్గొట్టాలని ప్లాన్ వేసుకుంటున్నారు. 2024–25లో హిందూపురం పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ రోడ్ మార్జిన్లపై విక్రయించు వారితో సుంకం వసూళ్లు, పెద్ద పశువుల తోళ్ల మార్కెట్ సుంకం వసూళ్లపై వేలం పాటలో రాము అనే వ్యక్తి రూ.43 లక్షలకు దక్కించుకొని మున్సిపాలిటీకి ఇంకా రూ.20 లక్షలు బకాయి పడ్డాడు. బకాయి కట్టకుండానే 2025–26 సంబంధించి రూ.64.33 లక్షలకు రాము బంధువుల పేరిట దక్కించుకున్నారు. ముందస్తు ప్రణాళిక మేరకే వేలం పాట మమ అనిపించేశారు. అయితే మున్సిపల్ అధికారులు బకాయిలపై మాట్లాడకుండానే వాటి ఆమోదం కోసం కౌన్సిల్ సమావేశం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

హిందూపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించనున్న మీటింగ్‌కు మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు అందరూ హాజరుకావాలని కమిషనర్ సంగం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

ముస్లింలకు ఇఫ్తార్ విందు



రొద్దంలో ఇఫ్తార్ విందు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొద్దం: మండల కేంద్రంలోని జామియ మసీదు వద్ద రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముతవల్లి ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. ఉపవాసం ఉన్న వారికి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, ఎన్.నారాయణరెడ్డి, నరసింహులు, సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి తదితర పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలపై ఫిర్యాదు

పెనుకొండ రూరల్: నీటి పంపు మోటార్లుకు సంబంధించి వరుస దొంగతనాలపై సర్పంచ్ అశ్వర్థనారాయణ కియా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మునిమడుగు పంచాయతీ గ్రామంలోని సచివాలయం వద్ద ఉన్న పంచాయతీ మోటార్‌కు సంబంధించి స్టార్టర్ పెట్టె, వైరు రెండు రోజుల క్రితం దొంగతానికి గురయ్యాయి. అలాగే ప్రధాన రహదారి పక్కనే ఉన్న మోటారు వైర్లను కూడా అగంతకులు కత్తిరించారు. రెండు నెలల క్రితం పంచాయతీ గ్రామంలోని చిన్నపరెడ్డిపల్లిలోని మోటారు వద్ద రూ.40 వేల విలువ గల బందర్ కేబుల్ వైరును దోచుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కియా పోలీస్‌స్టేషన్‌లో సర్పంచు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక చట్టాలపై అవగాహన



పరిగి: మాట్లాడుతున్న తహసీల్దారు

పరిగి: భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించినట్లు, వీటిని అతిక్రమించి ఎక్కడైనా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని తహసీల్దారు హసీనా సుల్తానా తెలిపారు. శుక్రవారం మండలంలోని కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కలసి మెలసి జీవించి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని చిగమతిఘట్టలో పాఠశాల ఆవరణలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జమేదార్ రామలింగయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని కుర్లపల్లిలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. తహసీల్దార్ సౌజన్య లక్ష్మి మాట్లాడుతూ కుల వివక్షత, బాల్య వివాహాలు, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కుళ్లాయప్ప, ఏఎస్ఐ షర్ఫుద్దీన్, వీఆర్ఓలు రమేష్, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.